# భీష్మపర్వ కథాంశాలు

మహాభారతములోని ఆరవ పర్వము భీష్మపర్వము. ఇందులో 122 అధ్యాయములు ఉన్నాయి. 5942 శ్లోకాలు వున్నాయి. జంబూఖండవినిర్మాణపర్వము, భూమిపర్వము, శ్రీమద్భగవద్గీతా పర్వము, భీష్మవధ పర్వమని నాలుగు ఉపపర్వములున్నాయి.

## 1) జంబూఖండవినిర్మాణ పర్వము :-

వైశంపాయునుని జనమేజయుడు కురుక్షేత్రంలో కౌరవ పాండవ పక్షీయులైన రాజులు ఏవిధముగ యుద్ధము చేశారని అడిగాడు. కురుపాండవసైన్యం వారి వారి శిబిరములలో ఉండటానికి అన్ని సదుపాయాలు కల్పించబడినవి. ఇందులో యుద్ధనియమాలు విశేషరూపముగ వర్ణింపబడ్డాయి. సూర్యాస్తమయం తరువాత యుద్ధము ముగించాక ఎవరు ఎవరితోను శత్రుభావంతో వ్యవహరించగూడదు. ఆసమయంలో అందరు ప్రేమ భావముతో మెలగ వలెను. వాగ్యుద్ధము చేయువానితో వాగ్యుద్ధము మాత్రమే చేయవలెను. సైన్యమును విడిచి బయటకు వచ్చిన వ్యక్తిని చంపుట నిషిద్ధము. పదాతులు, రథికులు, అశ్వారోహులు, గజారోహులు వారితో సమానమైన వారితోనే యుద్ధము చేయవలెను. అజాగ్రత్తగా నున్న భయపడుతున్న వ్యక్తి పై దాడి చేయుట నిషిద్ధము, సూతులు, భేరీ శంఖవాదకులు, శస్త్రములను సైన్యమునకు చేర్చువ్యక్తులను ఎదుర్కొనుట అనుచితము.

రెండవ అధ్యాయమున వేదవ్యాసుని ఆగమనము, కౌరవనాశమునకు సమయము వచ్చినట్లు మహర్షిసూచించుట, కురుక్షేత్రయుద్ధమును చూచే శక్తిని ధృతరాష్ట్రునికి ప్రసాదిస్తానని వ్యాసుడు సూచించుట, పుత్రమరణము చూచుటకు ధృతరాష్ట్రుడు ఇష్టపడకపోవుట, కాని యుద్ధవిషయములను వినుటకు ఇష్టపడుట, యుద్ధవిషయములను వర్ణించుటకు వ్యాసమహర్షి సంజయునకు దివ్య దృష్టిప్రదానము చేయుట, భయ సూచకములగు అనేక ఉత్పాతములు వర్ణింపబడినవి. మూడవ అధ్యాయమున జ్యోతి శ్శాస్త్రము ననుసరించి గ్రహ నక్షత్రముల స్థితి, స్థాన పరివర్తనము, తిథిక్షయము మున్నగువాని ద్వారా అమంగళసూచక ఉత్పాతములు, విజయసూచక లక్షణములు చెప్పబడినవి. నాల్గవ అధ్యాయమున భూమి యొక్క మహత్త్వము

చూపబడినది. ప్రాణులన్నియు భూమి మీదనే జన్మించి అందే లీనమగును. భూమియే చేతనాచేతనములన్నిటికి ఆశ్రయము. దీనిమీద ఆసక్తికల్గిన మనుష్యులు
యుద్ధము ద్వారా తమ ప్రాణములను అర్పించెదరు. స్థావర జంగమములలో మనుష్యులు శ్రేష్ఠులు.

అయిదవ అధ్యాయంలో పంచమహాభూతముల గుణములు, సుదర్శనద్వీపము వర్ణింపబడినవి. చక్రము వలె గోళాకారమై, లవణ సముద్రముతో చుట్టుకోబడి, సమస్త సంపదలకు నిలయము అయిన సుదర్శన ద్వీపము అద్దమున ప్రతిబింబము వలె చంద్రమండలమున ప్రతిబింబించు చున్నది.

ఆరవ అధ్యాయమున సువర్ణద్వీపము యొక్క భారత, హైమవత, హరి,మున్నగు వర్షములు, హేమకూట, నిషధ, గంధమాదనాది పర్వతములు, సువర్ణగిరి మేరుపర్వతము వర్ణింపబడినవి. బ్రహ్మ లోకము నుండి బిందు సరోవరము మీదుగా గంగ వచ్చుట అక్కడి నుండి అది నలిని, పావని, సరస్వతి మున్నగు ఏడు శాఖలుగ విడిపోవుట చెప్పబడినది, 7,8,9,10 అధ్యాయములలో క్రమముగ భారతదేశపునదులు, దేశములు, జనపదముల పేర్లు, అక్కడి ప్రదేశమాహాత్మ్యములు వర్ణింప బడినవి. యుగములననుసరించి మనుష్యుల ఆయుః ప్రమాణము, వారి గుణములు వర్ణింపబడినవి, దాని ననుసరించి కృతాదియుగములలో 4000,3000,2000 సంవత్సరములు జీవన ప్రమాణము చెప్పబడినది. కలియుగమున ఎటువంటి ప్రమాణము లేదు. దీనితో మొదటి ఉపపర్వము పూర్తియగును.

**2) భూమి పర్వము**:-

ఇందు రెండు అధ్యాయములుగలవు, 11వ అధ్యాయమున శాకద్వీపము యొక్క విస్తృత వర్ణనగలదు. ఇందు దేశ, పర్వత నదుల వర్ణనము, మంగ, మశక, మానస,మందగ అను నాల్గు జనపదముల వివరణముగలదు. ఇందు బ్రాహ్మణ క్షత్రియాది చతుర్విధ వర్ణములు నివసించెడివారు. స్వధర్మపాలన మందు అందరూ ఆసక్తులగుటచే ఇచ్చట రాజు లేడు, దండ విధానము లేదు. 12 అధ్యాయమున కుశ, శాకాది అయిదు ద్వీపములు, రాహు, సూర్య,చంద్రుల ప్రమాణము, వాటి

వ్యాసము పరిధి వర్ణింపబడినది.

**3) భగవద్గీతా పర్వము:-**

12వ అధ్యాయమునుండి 42వ అధ్యాయము వరకు భగవద్గీతాపర్వము. దీని ఆరంభమున సంజయుడు యుద్ధభూమి నుండి తిరిగి వచ్చి ధృతరాష్ట్రునికి భీష్ముని

చంపిన విషయమును చెబుతాడు. ఇది విని విలపిస్తున్న ధృతరాష్ట్రుడు భీష్మవధ వృత్తాంతమును విస్తృతముగ విన వలెనను కోరిక వ్యక్తం చేస్తాడు. 15వ అధ్యాయమున ధృతరాష్ట్రుని ప్రశ్నకు సమాధానంగా భీష్ముని రక్షించుటకు దుర్యోధనుడు దుశ్శాసనుని ఆదేశించిన విషయము చెప్పబడినది. దుర్యోధనుడు భీష్ముని రక్షించుట మనప్రధానకార్యమని చెబుతాడు. శిఖండి పూర్వరూపమున స్త్రీ అగుటచే భీష్ముడు శిఖండిని చంపబోనని ప్రతిజ్ఞ బూనినాడు. కనుక శిఖండి నుండి భీష్ముని రక్షించుటకు వ్యవస్థ, శిఖండిని చంపే ప్రయత్నం చేయమని దుర్యోధనుడు ఆదేశించుట వర్ణింపబడినవి, అనువింద, కేకయ, కాంబోజ, కోసల రాజులు, కృతవర్మమున్నగు వీరపురుషులు, వారి సైన్యము వర్ణించబడినది. 17వ అధ్యాయమున సైన్యము, వ్యూహములు, వాహనములు, ధ్వజములు కౌరవసేన కోలాహలము, భీష్మరక్షకులు వర్ణింపబడెను. అర్జునుని సలహాతో యుధిష్ఠిరుడు వజ్రవ్యూహరచన చేయుట, భీమసేనుని నాయకత్వము పేర్కొనబడినది.

20వ అధ్యాయమున కౌరవపాండవుల సేన యొక్క స్థితి, కౌరవసేన అభియానము వివరించబడినని. కౌరవ సేనను చూచి యుధిష్ఠిరుడు విషాదము చెందుట శ్రీకృష్ణుని కృపవలన పాండవుల విజయము సునిశ్చితమని అర్జునుడు ధైర్యము చెప్పుట చెప్పబడినది. భీమార్జునుల ప్రశంస, కౌరవసేనను నశింప జేయుటకు శ్రీకృష్ణుడు అర్జునుని ఆదేశించుట వివరించబడినది. 23వ అధ్యాయమున అర్జునుడు శక్తి స్వరూపిణియగు దుర్గను ఆరాధించుట, 24వ అధ్యాయమున సైనికుల హర్ష ఉత్సాహములను గూర్చి ధృతరాష్ట్రసంజయుల సంవాదము గలవు. 25 నుండి 42 అధ్యాయములలో భగవద్గీత వర్ణింపబడినది.

గీత మానవ కళ్యాణము కొఱకుపకరించు విశేష ఘట్టము, మానవ జీవనమునకు సంబంధించి సమస్త సమస్యలకు సమాధానము గీతలో

లభించును, సంసారమునకు సంబంధించిన ఘోర అంధకారము, విపత్తి, సంకటము, క్షోభ,భయము, నిరాశలకు ప్రకాశము నిచ్చునది గీత. విషాదమునుండి యథార్థ స్థితికి చేరుటకుపకరించును. అజ్ఞానములో కొట్టు మిట్టాడు మనసునకు మిత్రుడు గురువు వలె ప్రకాశమును చూపును. మానవమాత్రులను ఏకత్వమను సూత్రమున కట్టి వేయునది, మనుష్యులలో నైతిక, ఆధ్యాత్మిక భావనను జాగృతము చేయునది గీత.

గీత మొదటి అధ్యాయము అర్జున విషాద యోగమని ప్రసిద్ధము. అర్జునుని విషాదము యోగరూపమున ఇందు ప్రస్తావించబడినది. ఇది ఆధ్యాత్మిక మార్గమునకు,

జీవనము సాఫల్యము చేసుకొనుటకు ఒక సాధనము. అర్జునుడు వీరుడు, సాత్త్వికుడు, నిశ్చలుడు, పవిత్రుడు. కాని విషాదము అతనిని ఆవరించినది. దీనివలన భౌతికసుఖములకు ఆకర్షితుడుకాక సత్యమును అన్వేషించు వాడాయెను. శ్రీకృష్ణుడు రథసారథిగా గురువుగా దొరుకుట అతని భాగ్యము. సద్గురువు, విషాదము కూడా జీవితమును ఉత్తమ మార్గము వైపు నడిపించును. విషాదము వలన అనాసక్తి ప్రారంభమై అవిచలమగు ప్రసన్నత లభించును. అర్జునుని విషాదయోగమే అతనిని శ్రీకృష్ణుని శరణు వేడునట్లు చేసినది. భక్తి, జ్ఞానము,కర్మల త్రివేణిని ప్రవహింపజేసి అతని జీవితమును ఆనందమయము చేసినది. విషాదము ఒక మానసిక ఆఘాతము యొక్క అవస్థ. ధన, జన,మానహాని అయినప్పుడు, బుద్ధిమనస్సుల సమతౌల్యము దెబ్బ తిన్నప్పుడు విషాదము కల్గును. కాని ఇదే విషాదము సద్గురువు, సద్గ్రంథము లేక భగవంతుని శరణు పొందినపుడు గొప్పపరివర్తనము లేక ఉన్నతికి కారణమగును. అర్జునుని విషాద యోగము ఫలితమే గీతాసందేశము.

గీత రెండవ అధ్యాయము సాంఖ్యయోగము లేక జ్ఞానయోగము. ఇందు జ్ఞానయోగము అవలంబనముగా కర్మయోగము ప్రతిష్ఠించబడినది. కనుకనే అధ్యాయము ప్రారంభమున ఆత్మస్వరూప వివేచనము జరిగినది. అనేక యుక్తులద్వారా నిష్కామ భావముతో స్వధర్మపాలనము గావించవలెనని చెప్పబడినది. ఫలాసక్తి లేకుండగ కర్మచేయుట వలన చిత్తశుద్ధి, దాని వలన ఆత్మజ్ఞానము కల్గును. నిష్కామకర్మ యొక్క అభ్యాసము వలన స్థితప్రజ్ఞుడగును. కర్మయోగి వివేకము, సాహసము, ధైర్యము, దృఢత్వముతో కూడి స్వధర్మమును పాలించును. ఫలము

ఎప్పుడు ఈశ్వరాధీనము కనుక అతడు ఫలమును గూర్చి విచారణ చేయడు. ఈశ్వరునియందు విశ్వాసము, దృఢ భక్తి కల్గియుండుటచే కర్మయోగి ఎన్నడూ నిరాశ చెందడు. ఇతడు భోగము నుండి త్యాగము స్వార్థమునుండి పరమార్థము, సంకీర్ణత్వము నుండి ఉదారత్వము, కుటిలత్వము నుండి సరళత్వము, మోహము నుండి ప్రేమ వైపు మొగ్గుచూపును, కర్మయోగ సాధన మనుష్యుని పరమాత్మ యొక్క చిన్మయ ఆనందమయస్వరూపమందు లగ్నము చేయును.

గీత మూడవ అధ్యాయమున శ్రీకృష్ణ భగవానుడు స్పష్టము చేసిన విధానము--కామము మనుష్యుని ఇంద్రియములు, మనస్సు, బుద్ధిని భోగాసక్తము చేసి వారిని విషయముల యందు ఆసక్తి కలవారుగ చేయును. కామము నష్టముచెందిన మనుష్యుడు నిష్కామ కర్మచేసి కర్మయోగి యగును. నిష్కామ కర్మవలన చిత్తశుద్ధిజరిగి
జ్ఞానోదయము అగును. స్వార్థభావ, సంకీర్ణములనుండి బయటపడి పరమార్థభావ,ఔదార్యములతో నిష్కామకర్మ చేయుటయే యజ్ఞము. అహంకారముతో కర్మయందు. ప్రవృత్తమగుట వలన కర్మ దూషితమగును. మానవుడు స్వధర్మపాలనా తత్పరుడై కర్తవ్యమును ఆచరించవలెను. అధ్యాత్మశక్తితో కూడి పురుషార్థమాచరించుట, పరమార్థప్రాప్తి, రాగద్వేషరహితుడై పరమాత్మను సాధించుట మున్నగు విషయములు పేర్కొనబడినవి.

గీత నాల్గవ అధ్యాయమున జ్ఞానకర్మ సన్యాస యోగములు చర్చించబడినవి. ఇచ్చట జ్ఞానమనగా తత్త్వజ్ఞానము, కర్మయనగా కర్మయోగము, సన్యాసమనగా సాంఖ్యము లేక జ్ఞాన యోగము. కర్మసన్యాసమనగా కర్మత్యాగము లేక ఫల నిరపేక్షమగు కర్మ. అధ్యాయము ఆరంభమున శ్రీకృష్ణుడు కర్మయోగమును. అవతార రహస్యములను వివరించెను. భగవంతుడు స్వయముగా అవతారము నెత్తి ధర్మస్థాపన అధర్మనాశము చేయుట ద్వారా సమాజ వ్యవస్థను పునర్నిర్మాణము చేస్తూ తమ ఆచరణతో మానవీయమూల్యములను, ఆదర్శములను పునరుజ్జీవితం చేస్తున్నారు. భగవంతుడు సమాజ కళ్యాణం కొఱకు సదాచారమును రక్షించుట, దుష్టత్వమును అణచి వేయుటను చేయుచున్నారు. వివిధములగు దేవి, దేవతల రూపంలో పరమాత్మయొక్క ఉపాసన జరుగుచున్నది. పరమాత్మను పొందుటకు యజ్ఞములు

చేయచున్నారు. వీనిలో జ్ఞానయజ్ఞములు శ్రేష్ఠమైనవి. శ్రీకృష్ణుడు అర్జునుని కర్మయోగమునకు అధికారిగా తలచి కర్మచేయుటకు ఆదేశించెను. కర్మయోగి జీవితమున మానసిక అనుశాసనమునకు విశేషమహత్త్వము కలదు. మానసిక చింతనము శరీరముపై, శరీరస్వార్థము మనస్సుపై ప్రభావము చూపును. స్వార్థమును వీడి జనహితము కోరుచు కర్మ చేయుటయే యజ్ఞభావనతో కర్మచేయుట యగును.

అయిదవ అధ్యాయమున కర్మ సన్యాస యోగము చెప్పబడినది. పరమాత్మతో ఐక్యమును పొందుటకు కర్మ సన్యాసయోగము ప్రధాన సాధనము. మాయా సహిత బ్రహ్మ సగుణమని, మాయా రహిత మైనచో నిర్గుణ శుద్ధచైతన్య బ్రహ్మయని యందురు. పరబ్రహ్మనిర్గుణుడు, నిర్వికారుడు, శుద్ధచైతన్య స్వరూపమని జ్ఞానుల చింతన. అట్టి బ్రహ్మయొక్క అంశమే ఆత్మ. దేహ, ఇంద్రియాదుల కర్మ ప్రకృతికి కారణము. దీనితో ఆత్మకు ఏవిధమగు సంబంధము లేదు. జ్ఞానయోగి మననము, నిదిధ్యాసనము ద్వారా ఆత్మయొక్క శుద్ధస్వరూపమును తెలుసుకొనును. ఇతడు జీవన కాలముననే ముక్తుడగును. యుద్ధభావముతో సహజకర్మ చేయుటవలన దేహము నష్టమై
బ్రహ్మయందు లీనమగును. నిస్వార్థ భావనతో నిరంతరము కర్మ ఆచరించుట కర్మయోగి ధర్మము. యోగి సకల జీవుల హితమును కోరువాడు.

ఆరవ అధ్యాయమున ఆత్మసంయమయోగ, కర్మయోగముల ప్రతిష్ఠ చేయబడినది. కర్మయోగి సన్యాసిగా చెప్పబడెను. ఫలాపేక్ష లేక ఈశ్వరార్పణ బుద్ధితో కర్మ చేయువాడు సన్యాసి, యోగి అనబడును. ఆత్మ సంయమయోగము యొక్క సారమే ధ్యానము. ఇదే సంపూర్ణయోగము. మనుష్యుడు వివేకము, విచారము, స్వాధ్యాయము, సత్సంగము, అభ్యాసముల ద్వారా తనను తాను తెలుసుకొని ఆనందమయుడై కృతకృత్యుడగును. వివేకియగు మనుష్యుడు తటస్థుడై బాహ్య జగత్తును చూచి దానిని సరిదిద్దు ప్రయత్నం చేస్తాడు. మానవుడు తన జీవితము యొక్క గొప్పతనమును తెలుసుకొని మాన అపమానముల నుండి బయటపడి కర్మమార్గమున ఆసక్తుడు కావలెను. సత్పురుషుడు మానమును కోరడు, అపమానమంటే భయపడడు. కర్మయోగి భవిష్యచింతన మాత్రముగావించును. అతీతములను పట్టించుకోడు.

జ్ఞానము,కర్మ,భక్తి ఈ మూడును పరమాత్మతో ఐక్యమును పొంది యోగములగుచున్నవి. సుఖదుఃఖములకు కారణము మనస్సు. మానవుడు ఆలోచనలద్వారా తనమనస్సు యొక్క నిర్మాణము గావించును. యోగీశ్వరులందరిలో పరమేశ్వరుని శ్రద్ధాపూర్వకముగా భజించువాడే శ్రేష్ఠుడని శ్రీకృష్ణుడు చెప్పెను.

ఏడవ అధ్యాయమున జ్ఞానము విజ్ఞాన యోగముగా చెప్పబడినది. భక్తి, జ్ఞాన, వైరాగ్యములు గీత ఆరంభము నుండి ప్రస్తుతింపబడు చున్నను మొదటి ఆరు అధ్యాయములు కర్మ సంబద్ధములు, రెండవ ఆరు అధ్యాయములు భక్తిమూలకములు, చివరి ఆరు అధ్యాయములు జ్ఞానమూలకములుగా చెప్పబడుచున్నవి. పరమాత్మ నిర్గుణుడు, చిన్మయుడై నప్పటికి మాయా సహితుడై సృష్టి, స్థితి, లయలకు కారణమగు చున్నాడు. పర,అపర యని ప్రకృతి రెండు విధములు. అపరా ప్రకృతి యందు వికృతి కల్గిన సృష్టియేర్పడును. అపరా ప్రకృతి 8 విధములు. రెండవది పరా ప్రకృతి. ఇది చేతన స్వరూపము. దీని వలన జీవాత్మ ప్రకటితమై దేహములలో ప్రవేశించును. మాయాముక్త పరమాత్మ ఈశ్వరుడు, మాయాయుక్తుడు జీవుడు. ధ్యేయుడు పరమాత్మయే.

ఎనిమిదవ అధ్యాయమున అక్షరపరబ్రహ్మయోగము చర్చించబడినది. జీవితమనగా నేమి? మృత్యువు తరువాత ఏమి యగును? మున్నగు ఎన్నియో ప్రశ్నలు మనకు కలుగును. అర్జునుని ఈ ప్రశ్నలకు శ్రీకృష్ణుడు సమాధానము చెప్పెను. వారి మాటలలో జీవ చైతన్యము ఆత్మలక్షణము. ఆత్మ పరంజ్యోతి స్స్వరూపుడగు పరమాత్మయొక్క అంశము. పరమాత్మయొక్క చైతన్య రూపము పరా ప్రకృతి అచేతనములకు మూలకారణము. బ్రహ్మపదార్థమే వాస్తవికతత్త్వము. అది అక్షరము అనగా నాశము, లేనిది. నిత్యము. స్వయంప్రకాశ్యము, నిర్వికారము, నిర్గుణము, నిరుపాధికము. మాయకారణముగా సగుణము. చైతన్యశక్తి, క్రియాశక్తియని పరమాత్మకు రెండు శక్తులు గలవు. బ్రహ్మాండస్థ పరమాత్మయే ప్రాణులలో ఆత్మ. జ్ఞాని జీవన కాలముననే జీవన్ముక్తుడై ప్రాణములు విడిచిన పిమ్మట బ్రహ్మతో ఐక్యమును బొందును. సగుణ బ్రహ్మను ఉపాసించువారు నిష్కామ కర్మలనాచరించి కొంత సమయము వరకు వైకుంఠాదులలో నుండి పిమ్మట పరమాత్మలో ఐక్యమును పొందెదరు.

తొమ్మిదవ అధ్యాయమున శ్రీకృష్ణ భగవానుడు భగవత్ ప్రాప్తికి ఉపాయము చెప్పినాడు. అత్యంతము సరళము, సుగమము, సులభమగుటచే మహత్త్వపూర్ణమగు ఈ ఉపాయమును రాజవిద్య లేక రాజయోగమని చెప్పుచున్నారు. పరమేశ్వరుడు మాయారూపమగు ప్రకృతి ద్వారా సృష్టిరచన, సంచాలనము, సంహారములు చేయును. ఈకారణముచే వివేకశీలుడు పరమాత్మను సేవించుచున్నాడు. భగవంతుని ప్రసన్నము చేసుకొనుట సులభము. పత్ర, పుష్ప, ఫల, జలమును భక్తి భావముతో సమర్పించుట వలన ప్రసన్నుడుకాగలడు. ఈ అధ్యాయము చివర శ్రీకృష్ణుడు అర్జునునితో మనస్సును పరమాత్మయందు లగ్నము చేసి భక్తితో కొలిచిన భగవంతుని పొందవచ్చని చెప్పెను. గీత ఆరంభమున జ్ఞాననిష్ఠ, కర్మనిష్ఠలు చర్చించబడినవి, భక్తియోగము కర్మయోగమున అంతర్భవించునని చెప్పెను. శ్రీకృష్ణుడు అర్జునుని కర్మవిడిచి పెట్టి భక్తితో సేవించమని ఉపదేశించడు. కర్మచేస్తూ భక్తి పూర్వకముగా కొలవమని ఆదేశిస్తాడు. కర్మ బహిరంగమైతే భక్తి అంతరంగము. కర్మఫలత్యాగమునకు ఒక ఉపాయము లేక సాధనమే రాజయోగము. కర్మఫలమును విడిచిపెట్టుటయే సరిపడదు. కర్మనుకూడా భగవదర్పణము చేయవలెను.

పదవ అధ్యాయము విభూతియోగమని ప్రసిద్ధము. పరమాత్మ కేవలము సృష్టికి కారణము కాదు. అణువణువు నందు అతడు వ్యాపించియున్నాడు. పరమేశ్వరునిస్వరూపమే ఈ చిత్ర విచిత్ర సృష్టి. బాలుడు ప్రారంభమున వర్ణమాలనేర్చుకొని పిమ్మట జటిల భాషను చదువుతాడు. అట్లే భక్తుడు కూడా మొదట కొన్ని పదార్థములను భగవద్రూపముగా తలచి పిమ్మట సృష్టియంతయు బ్రహ్మమయమను భావన పొందుతాడు. పరమేశ్వరునిసోపాధిక స్వరూపవర్ణనమే విభూతి వర్ణనము. ఏయే భవములగు పశు పక్ష్యాదులను చూచుటవలన భక్తునికి భగవంతుని అపూర్వశక్తి స్మృతి పథమునకు వచ్చునో అవన్నియు విభూతులే. భగవత్స్వరూపములే. ఇవన్నియు భక్తిప్రేరకములు.

పదకొండవ అధ్యాయమున విశ్వరూపదర్శనయోగము వర్ణింపబడినది. విభూతియోగ విశ్వరూప యోగములకు పరస్పరము ఘనిష్ఠ సంబంధముగలదు. పరమాత్మ ఏయే వస్తువులలో విశేషరూముగా భాసించునో దానినే విభూతియందురు. ఆయావస్తువులు, వ్యక్తులు పరమేశ్వరుని ఆరాధించుటకు ప్రేరకములగు చున్నవి. పరమేశ్వరుని

విశ్వరూపమును చూడవలెనని కోరిక కల్గిన అర్జునుడు సోపాధికమగు విశ్వరూపమును చూపించుటకు భగవంతుని ప్రార్థించెను. విశ్వరూపసందర్శనమునకు శ్రీకృష్ణుడు అర్జునునికి దివ్యదృష్టి ప్రదానము చేసెను. విశ్వరూప దర్శనము తరువాత అర్జునుడు చేసిన భగవంతుని స్తుతియే విశ్వరూపదర్శనము యొక్క సారము. అర్జునుడు భగవంతుని "పరమాత్మ! మీరే అక్షర బ్రహ్మ, సమస్త జగత్తునకు ఆధారభూతులు, ఆది మధ్యాంతరహితులు" అని స్తుతించెను. విశ్వరూపదర్శనముచే ఆనందించిన అర్జునుడు పిమ్మట భయంకరమగు రూపమును చూచి మీరెవరని ప్రశ్నిస్తాడు. అప్పుడు భగవంతుడు మహాకాల రూపమున ప్రకటితమై వినాశముకొఱకు ప్రవర్తించుచున్నాను. నీవు యుద్ధము చేయక పోయినను యుద్ధము తప్పక జరుగును. వినాశము తప్పనిసరి. జగత్తునకు విధాత, కర్మఫలప్రదాత నేనే. నీవు నిమిత్తమాత్రుడ వని సమాధానముచెప్పెను. అహంకారమును విడిచి, నిర్మలచిత్తుడవై, దైవీయోజన పూర్తిచేయుటకు నిమిత్తమాత్రుడవు అయి మానవ జీవితమును సఫలము చేసుకోమని భగవంతుని ఉపదేశము.

గీత పంద్రెండవ అధ్యాయమున భక్తి యోగము వర్ణింపబడినది. అర్జునుడు సృష్టిరహస్యము, ఉత్పత్తి స్థితి నాశములకు మూలకారణమగు పరమతత్త్వము, ఆత్మస్వరూపమును తెలుసు కోవలె ననుకొనును. గీతామృతమును పానము చేస్తూ చేస్తూ భ్రమతో కూడి విచలితుడగును. వెనుకటి అధ్యాయములలో శ్రీకృష్ణుడు జ్ఞానము యొక్క మహత్త్వమును చెప్పి రాజయోగ, విభూతి, విశ్వరూప దర్శన యోగములద్వారా అనన్యభక్తునిగా కమ్మని ఆదేశించెను. సగుణ,నిర్గుణ ఉపాసనలలో ఏది శ్రేష్ఠమని అర్జునుడు అడుగగా భగవంతుడు భక్తి యొక్క మహిమను స్పష్టము చేసెను. సగుణ బ్రహ్మయందు మనస్సులగ్నముచేసి శ్రద్ధతో భగవంతుని ఆరాధించు భక్తగణము శ్రేష్ఠులు. నిర్గుణ బ్రహ్మను ఉపాసించు వారు కూడా పరబ్రహ్మను
పొందెదరు. నిర్గుణోపాసన జ్ఞానసాధ్యముకాగా సగుణోపాసన భక్తిసాధ్యము. అర్జునా! నీవు సగుణోపాసనకు అధికారివి. ఈవిధముగా శ్రీకృష్ణుడు భక్తి మార్గము యొక్క మహత్త్వమును ప్రతిపాదించెను. భక్తి మార్గము ద్వారా భక్తుడు మాయాశక్తియుక్త పరమాత్మను సులభముగా పొందగలడు. భగవద్భక్తి సమస్త దోషములను, దౌర్బల్యములను పోగొట్టి

మనుష్యుని పరిపూర్ణుని చేస్తుంది.

గీత పదమూడవ అధ్యాయమున క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగము వివరించబడినది. మనుష్యుడు అజ్ఞానవశమున తనను దేహముగా తలచుచున్నాడు. ఇది సత్యమా, అన్న ప్రశ్నకు సమాధానముగా శ్రీకృష్ణ భగవానుడు దేహము ఆత్మకు క్షేత్రము అయితే ఆత్మ దేహమునకు స్వామి, పోషకుడు, ధారకుడు, క్షేత్రజ్ఞుడు. పరమాత్మ తన శక్తితో సమస్త ప్రపంచమును సృజించెను. జీవరూపము, జడరూపమని సృష్టిరెండు విధములు. ప్రాణుల దేహము, జడవస్తువులని జడము రెండు విధములు. ప్రాణుల దేహము జడ క్షేత్రము. అది సచేతనమగు ఆత్మ సంపర్కమువలన గతిశీలమగుచున్నది. సమస్త బ్రహ్మాండము పరమేశ్వర రూప క్షేత్రజ్ఞునకు క్షేత్రము. క్షేత్రము వికారవంతమగుటచే పరివర్తన శీలమై వినాశమును పొందును. క్షేత్రజ్ఞుడు వికారరహితుడు నిత్యుడు. ఈ అధ్యాయమున జ్ఞానప్రాప్తికి సాధనములు, జ్ఞాని లక్షణములు విచారింప బడినవి. అమానిత్వము, అదంభిత్వము అహింస, ఆర్జవము, ఆచార్యోపాసన మున్నగునవి జ్ఞాన సాధనములు, జ్ఞాని లక్షణములు.

గీత పదునాల్గవ అధ్యాయమున గుణత్రయ విభాగయోగము వర్ణింపబడినది. సృష్టిరచన చేసెడి ఈశ్వరీయ శక్తిని మాయ లేక ప్రకృతి యందురు. శుద్ధ చైతన్య స్వరూపుడగు పరమాత్మ మాయాశక్తి సంపన్నుడైనప్పుడు ఈశ్వరుడు లేక పరమేశ్వరుడందురు. క్షేత్రమున విత్తనములునాటి స్వామి అన్నాదులను ఉత్పత్తి చేయునట్లు పరమాత్మ జడ ప్రకృతియందు సంకల్పమను బీజము నాటి సృష్టి చేయును. దీని వలన జడ ప్రకృతి సచేతనమై గతిశీలమగును, సత్త్వరజస్తమోగుణములు మూడు ప్రకృతి గుణములు. సృష్టి అంతయు త్రిగుణమయము. వానిలో సత్త్వగుణము సర్వోత్కృష్టము, వైరాగ్యోత్పాదకము. రజోగుణము తృష్ణాకారకము, చాంచల్యమును కల్గించును. దీని వలన సంసారబంధములయందు మనుష్యుడు ఆసక్తుడగు చున్నాడు. తమోగుణము నికృష్టమైనది. అజ్ఞాన జనితమగు తమోగుణము వలన ఆలస్యాది దుర్గుణములు పుట్టును. త్రిగుణాతీత పురుషుడు జీవన్ముక్తుడై అమృతమయమగు పరమానందమును పొందుచున్నాడు. శ్రీకృష్ణుడు అర్జునునికి త్రిగుణాతీత పురుషుల
లక్షణములను చెప్పెను.

గీత పదిహేనవ అధ్యాయమున పురుషోత్తమ యోగము చర్చించబడినది. సృష్టి ఉత్పత్తి, మానవ, ఈశ్వరతత్త్వములు విచారింపబడినవి. ఈసంసారము అశ్వత్థ వృక్షము వంటిది. దీనిమూలము పైకి, శాఖలు క్రిందికి గలవు. అనగా వృక్షము యొక్క అదృశ్యమూలము పరమాత్మ. ప్రకృతి కారణంగా శాఖలు నిమ్న ప్రదేశమునకు వ్యాపించినవి. సంసారము నుండి ముక్తుడగుటకు వైరాగ్యమనెడి శస్త్రము అవసరము. వైర్యాగ్యము వలన విషయములయందు. అనాసక్తుడై దివ్య జీవనమును అనుభవించగలడు. ప్రకృతి, జీవుడు, పరమాత్మయని సృష్టియందు మూడుతత్త్వములు గలవు. జీవాత్మ నాశము చెందనిది అక్షరము. దేహము క్షరము అనగా నశించునది. ఈ రెండిటికి అతీతుడు పురుషోత్తముడు పరమాత్మ. అక్షర పురుషుడు జీవాత్మ భోక్త. క్షర పూరుషుడు స్థూల ప్రకృతి భోగ్యము. ఈ రెండిటికి అతీతుడు పరమాత్మ.

గీత పదహారవ అధ్యాయమునకు దైవాసురసంపద్విభాగయోగమని పేరు. ఇందు దైవీ, ఆసురీయని ప్రకృతి రెండు విధములుగా చెప్పబడినది. రెండు మార్గములను ప్రస్తావిస్తూ మనుష్యుడు ఏదేని మార్గమును ఎన్నుకొనుటకు స్వతంత్రుడని చెప్పబడినది. ఈ అధ్యాయమున దైవీ, ఆసురీ రెండిటి లక్షణములు వివరించబడినవి. అభయము, అంతఃకరణశుద్ధి, తత్త్వజ్ఞానముకొఱకు ధ్యానయోగమునవలంబించుట, సాత్త్వికదానము, ఇంద్రియ నిగ్రహము, ఉత్తమ కర్మాచరణము, వేదశాస్త్రాది పఠనము, అహింస, సత్యనిష్ఠ, క్రోధత్యాగము మున్నగునవి దైవీసంపద లక్షణములు. దీనికి విపరీతములు ఆసురీసంపద లక్షణములు, దైవీసంపత్తి ముక్తికి, ఆసురీసంపత్తి బంధమునకు హేతువులు.

గీత పదిహేడవ అధ్యాయమున శ్రద్ధాత్రయ విభాగయోగము వర్ణింపబడినది. మనుష్యులందరి శ్రద్ధ వారి వారి అంతః కరణమునకు అనురూపముగా నుండును. పురుషుడు శ్రద్ధామయుడు. ఎవరికి ఎటువంటి శ్రద్ధయుండునో అదియే అతని స్వరూపము. స్వభావము చేతనే పుట్టిన శ్రద్ధ సాత్త్వికము, రాజసము, తామసమని మూడు విధములు, సాత్త్వికశ్రద్ధ ఆధ్యాత్మిక జీవన రహస్యము. రాజస తామస శ్రద్ధలను విడిచి పెట్టి సాత్త్విక శ్రద్ధను అవలంబించవలెను. యజ్ఞదాన తపాదులు సాత్త్వికరాజస తామసములని మూడు విధములుగా కలవని చెప్పి అందు సాత్త్వికమును గ్రహించుట సమర్థింపబడినది. ఓం తత్ సత్ బ్రహ్మనామము.

సృష్టిప్రారంభమున బ్రహ్మ బ్రాహ్మణ, యజ్ఞ, వేదములను సృజించెను. ఓం, తత్, సత్ అను పరమాత్మనామముల వైశిష్ట్యము
చెప్పబడినది. శ్రద్ధలేకుండగ చేయు ప్రతిపని అసత్ అన బడుతుంది. దాని వలన ఇహ పరలోకములలో ఎట్టి ప్రయోజనముండదని శ్రీకృష్ణుడు ఉపదేశించెను.

గీత 18 అధ్యాయమున మోక్షసన్యాసయోగము చర్చించబడినది. అధ్యాయము ఆరంభమున అర్జునుడు సన్యాసము, త్యాగము ఈ రెండిటి యథార్థ స్థితిని తెలుసుకొనుటకు ఆసక్తినిచూపును. శ్రీకృష్ణుడు విభిన్నమతములను ప్రస్తావించి మూడువిధముల త్యాగ స్వరూపమును వివరించెను. ఆసక్తి, ఫలేచ్ఛలను విడిచి కర్మచేయుట సాత్త్వికత్యాగము, చేయదగికర్మలను శారీరక క్లేశభీతితో విడిచి పెట్టిన రాజసత్యాగము. మోహావశముచే కర్మత్యాగము తామసత్యాగమనబడును. అకుశల కర్మను ద్వేషించడు. కుశలకర్మమీద ఆసక్తి చూపడు. శుద్ధసత్త్వగుణ సంపన్నుడగు అట్టి పురుషుడే నిజమైనత్యాగి. సంపూర్ణ కర్మ సిద్ధికొఱకు అయిదు హేతువులు చెప్పబడినవి. అధిష్ఠానము, కర్త, కరణము, వివిధములగు చేష్టలు, దైవము, శుద్ధస్వరూపమగు ఆత్మ ఈ అయిదిటికంటె భిన్నమగుటచే కర్తకానేరదు. సాత్త్విక, రాజస, తామసగుణ భేదములచే బుద్ధి, ధృతుల భేదమును చెప్పి అందు సాత్త్వికము ఉత్తమమైనదిగా పేర్కొనెను. బ్రాహ్మణ క్షత్రియుల స్వాభావికకర్మలను పేర్కొని ఇతరుల ధర్మము ననుసరించి స్వీయ కర్మలు గుణరహితములైనను స్వీయకర్మానుష్ఠానము పాపమును కల్గించదని చెప్పెను. కర్మ యోగి కర్మలను పరిపూర్ణంగా ఆచరిస్తూ భగవంతుని కృపవలన పరమ పదమును

పొందగలడని వివరించెను. శ్రీకృష్ణుడు అర్జునునితో అర్జునా! నీవు వాదవివాదములను, తర్కవితర్కములను విడిచి నాశరణు పొందుము. నిన్ను నేను పాపవిముక్తుడను చేసెదను. శోకించవలదు. గీతోపదేశము అధికారికి మాత్రము చేయవలెను. గీతా శ్రవణము చేయువాడు

పాపములనుండి ముక్తుడగును. అర్జునా! గీతోపదేశము వలన నీ అజ్ఞానము తొలగినదాయని శ్రీకృష్ణుడు అడిగెను. అర్జునుడు తమ కృప వలన నా సంశయములు తొలగినవి. మీ ఆజ్ఞను శిరసావహించెదనని పలికెను. వ్యాసమహర్షి కృపవలన దివ్యదృష్టిని పొంది గీతోపదేశమును ప్రత్యక్షముగా వింటినని సంజయుడు ధృతరాష్ట్రునికి చెప్పెను. ఎక్కడ

యోగీశ్వరుడగు శ్రీకృష్ణుడు, గాండీవ ధారియగు అర్జునుడు ఉండునో అచ్చట శ్రీ, విజయ, విభూతి, నీతు లుండునని సంజయుడు పేర్కొనెను.

**భీష్మవధపర్వము:-**

ఇందు ఆరంభమున గీతామాహాత్మ్యము చర్చించబడినది. గీత, గంగ, గాయత్రి,
గోవిందుడు అనుగకారముతో ఆరంభమగు నాల్గింటిని హృదయమున ధరించుట వలన మనుష్యునకు తిరిగి జన్మలేదు. ఈ అధ్యాయమున యుధిష్ఠిరుడు భీష్మపితామహ, ద్రోణాచార్య, కృపాచార్య, శల్యులతో యుద్ధము చేయుట వారి నుండి అనుమతి, ఆశీర్వాదములను పొందుట వర్ణించబడినది. తాము అర్థమునకు దాసులమై యుద్ధము చేయు చున్నట్లు భీష్మాదులు చెప్పిరి.

44 నుండి 49 అధ్యాయము వరకు మొదటి రోజు యుద్ధము వర్ణించబడినది. ఉభయపక్షముల సైనికుల ద్వంద్వయుద్ధము, భీష్మ-అభిమన్యుల యుద్ధము, శల్యుడు ఉత్తరకుమారుని వధించుట, భీష్ముని ప్రచండ పరాక్రమముతో మొదటి రోజు యుద్ధము ముగిసెను.

50-56 అధ్యాయములలో రెండవ రోజు యుద్ధము వర్ణింపబడినది. విచారగ్రస్తుడైన యుధిష్ఠిరుని శ్రీకృష్ణుడు ఓదార్చుట, ధృష్టద్యుమ్నుని ఉత్సాహము, క్రౌంచారుణవ్యూహ నిర్మాణములతో రెండవ రోజు యుద్ధము కౌరవసేన వ్యూహరచన, భీష్మార్జునులయుద్ధము, ధృష్టద్యుమ్న ద్రోణాచార్యుల యుద్ధము, అర్జున అభిమన్యుల పరాక్రమప్రదర్శనము మున్నగువానితో రెండవ రోజు యుద్ధము సమాప్తమగును.

56-59 అధ్యాయములలో మూడవరోజు యుద్ధము వర్ణింపబడినది. పాండవవీరుల పరాక్రమముతో వ్యాకులత చెందిన దుర్యోధనుడు భీష్మునితో చర్చించుట, భీష్ముని పరాక్రమము, అర్జునుని ప్రతిజ్ఞ, కౌరవసేన పరాజయములతో మూడవరోజు యుద్ధము పూర్తి యగును.

60-64 అధ్యాయములలో నాల్గవ రోజు యుద్ధము చెప్పబడినది. భీష్మార్జునుల యుద్ధముతో ప్రారంభమగును, అభిమన్యుని పరాక్రమము, ధృష్టద్యుమ్నుని ద్వారా శల్య పుత్రవధ, భీముడు గజ సేనను సంహరించుట, భీమ భీష్మ యుద్ధము, సాత్యకి భూరిశ్రవసుల యుద్ధము,

భీమసేనుడు, అతని పుత్రుడు ఘటోత్కచుని వలన కౌరవసేన పరాజయము వర్ణింపబడినది.

65-74 అధ్యా యములలో అయిదవరోజు యుద్ధము వర్ణింపబడినది. ధృతరాష్టసంజయ సంవాదముతో అధ్యాయము ప్రారంభమగును. నరనారాయణులగు శ్రీకృష్ణార్జునుల మహిమ ఇందు ప్రస్తుతింపబడినది. కౌరవ పాండవుల మకరవ్యూహ, శ్యేనవ్యూహరచన అయిదవరోజు యుద్ధములోని విశేషము. భీష్మ భీమసేనులు, భీష్మ అర్జునులు, భీష్మవిరాటులు, అశ్వత్థామ అర్జునులు, దుర్యోధన భీమసేనులు, అభిమన్యులక్ష్మణుల యుద్ధము వర్ణింపబడినది.

75-79 అధ్యాయములలో ఆరవరోజు యుద్ధము వర్ణింపబడినది. ధృతరాష్ట్రుని చింత, భీమసేన, ధృష్టద్యుమ్న ద్రోణాచార్యుల పరాక్రమము, అభిమన్యు ద్రౌపదీ పుత్రులు ధృతరాష్ట్రపుత్రులతో యుద్ధము చేయుట ఇందుగలదు.

80-86 అధ్యాయములలో ఏడవరోజు మహాసంగ్రామము వర్ణింపబడినది. వ్యాకులత చెందిన దుర్యోధనుకి భీష్ముడు ధైర్యమును చెప్పును. మండల, వజ్రవ్యూహరచనలతో కౌరవపాండవ యుద్ధము ఆరంభమగును. ద్రోణాచార్యవిరాట యుద్ధమున విరాటపుత్రుడగు శంఖుని మరణము, శిఖండి అశ్వత్థామల యుద్ధము, సాత్యకివలన అలంబుషుడు, ధృష్టద్యుమ్నుని ద్వారా దుర్యోధనుడు పరాజయము పొందుట, భీమసేన కృతవర్మల యుద్ధము మున్నగు ఘట్టములు వర్ణింపబడినవి.

87-96 అధ్యాయములలో ఎనిమిదవ రోజు సంగ్రామము వర్ణింపబడినది. భీష్ముని పరాక్రమము, భీమసేనుడు ధృతరాష్ట్రుని ఎనిమిదిమంది పుత్రులను వధించుట, భీష్మ దుర్యోధనుల యుద్ధవిషయక చర్చ, ఘటోత్కచ దుర్యోధనుల మహాసంగ్రామము, ఘటోత్కచుని మాయా ప్రయోగముచే కౌరవసేన పలాయనము, ఇరావంతుని వధవలన అర్జునుని విషాదము, భీమసేనుడు ధృతరాష్ట్రుని తొమ్మండుగురు పుత్రులను చంపుట మున్నగు విషయములు వర్ణింపబడినవి.

97-107 అధ్యాయములలో తొమ్మిదవ రోజు యుద్ధము వర్ణించబడినది. దుర్యోధనుడు తన మంత్రులతో చర్చించుట, అర్జునుని రక్షణకు దుర్యోధనుని ఉపాయము, అలంబుషరాక్షసవధ, కౌరవసేన పలాయనము, భీష్మార్జునుల యుద్ధమును చూచిన దుర్యోధనుడు భీష్ముని

రక్షించుటకు దుశ్శాసనుని ఆదేశించుట మున్నగునవి వర్ణించ బడినవి. భీష్ముని ద్వారా పరాజితమైన పాండవ సేన పారిపోవుటనుచూచి భీష్ముని చంపుటకు ఉద్యుక్తుడైన శ్రీకృష్ణుని అర్జునుడు వారించుటతో తొమ్మిదవరోజు యుద్ధము సమాప్తమగును. యుద్ధవిరామము తరువాత పాండవులు శ్రీకృష్ణునితో భీష్మవధకు ఉపాయము చర్చించుట వర్ణింపబడినది.

108-122 అధ్యాయములలో పదవరోజు యుద్ధము వర్ణింపబడినది. దీనితో భీష్మపర్వము సమాప్తమగును. భీష్మ శిఖండుల సమాగమము, భీష్మ వధకు కారణభూతుడైన అర్జునుడు శిఖండిని ప్రోత్సహించుటతో ఈ అధ్యాయము ప్రారంభమగును. పాండవుల ద్వారా తమ సేన నష్టమగుటను గమనించిన దుర్యోధనుడు భీష్ముని ప్రేరేపించును. అప్పుడు భీష్ముడు లక్షలకొద్ది సైనికులను సంహరించెను. అర్జునుని ప్రోత్సాహముచే శిఖండి భీష్మునిపై ఆక్రమణచేయును. ద్రోణాచార్యుడు
అశుభశకునములను సూచిస్తూ అశ్వత్థామను ధృష్టద్యుమ్నునితో యుద్ధము చేయమని ఆదేశిస్తాడు. భీముడు కౌరవ పక్షము వీరులతో ఒంటరిగా యుద్ధము చేస్తూ తన పరాక్రమాన్ని చాటుతాడు. భీష్ముని ఆదేశమునననుసరించి యుధిష్ఠిరుడు అతనిని అక్రమించెను. అర్జునుని బాణములకు భీష్ముడు మూర్ఛపోవును. తిరిగి తెలివి తెచ్చుకొని యుద్ధము చేయు భీష్ముని అర్జునుడు రథము నుండి క్రిందకు పడగొడతాడు. శిఖండి పూర్వరూపమున స్త్రీయగుటచే భీష్మునిపై దండెత్తాడు. భీష్ముడు అవధ్యుడైనప్పటికి స్వేచ్ఛామరణమునకై ఉత్తరాయణ పుణ్యకాలము కొఱకు నిరీక్షించెను. భీష్ముడు నేలమీద పడినా నేలతాకనట్లు శరీరములో బాణములు గ్రుచ్చుకొని యున్నవి. యుద్ధసమయము పూర్తియగుటచే ఉభయసేనలు శిబిరములకు వెడలినవి. అర్జునుడు అస్త్రముతో దివ్యజలమును ప్రకటింపజేసి భీష్ముని దప్పికను తీర్చెను. భీష్ముడు అర్జునుని ప్రశంసిస్తూ దుర్యోధనుని సంధి కొఱకు ప్రేరేపించుట, భీష్మ కర్ణుల రహస్య సంవాదముతో భీష్మపర్వము పూర్తియగును.

**ఇది భీష్మపర్వ కథాంశము.**